క్లుప్తంగా

తెగిపడ్డ ఏపీ ఫైబర్ కేబుల్


లైన్లు పునరుద్ధరిస్తున్న సిబ్బంది

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని పూండిగల్లి-బెండి వద్ద శనివారం ఏపీ ఫైబర్ కేబుల్ తెగి పడటంతో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. దీంతో పరిసర గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సేవలకు అంతరాయం కలిగింది. ఫైబర్ కేబుల్ సేవలు వినియోగించుకుంటున్న వినియోగదారులు సైతం ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయం తెలుసుకున్న కేబుల్ ఆపరేటర్లు వెంటనే స్పందించి సమస్య పరిష్కరించారు. కాగా పలు చోట్ల యంత్రాల సాయంతో కాలువ పూడిక తీత పనులు చేపట్టడంతో పాటు కొద్దిపాటి గాలులకు సైతం ఎప్పటికప్పుడు ఏపీ ఫైబర్ కేబుల్ లైన్లు తెగిపడుతున్నాయని ఆపరేటర్లు చెబుతున్నారు.

మాజీ మంత్రి సీదిరి పరామర్శ


గొర్లె పద్మావతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న సీదిరి అప్పలరాజు

పలాస: మండలంలోని రాజగోపాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గొర్లె వేణుగోపాలరావు తల్లి పద్మావతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు శనివారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ఆయనతో పాటు పార్టీ మండల కమిటీ నాయకులు పైల చిట్టిబాబు, ఉంగ సాయికృష్ణ తదితరులు ఉన్నారు

వైద్య శిబిరానికి స్పందన


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీ పొందర వీధిలో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జెమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు, ఎస్ఎస్ ఫౌండేషన్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, మణికంఠ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో వర్కర్స్ యూనియన్ ఏకగ్రీవ ఎన్నిక


ఎన్నికైన ఆటో యూనియన్ సభ్యులు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గేట్ వద్ద శనివారం నూకాలమ్మ తల్లి ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్షుడిగా బగాది ధర్మారావు, గౌరవ అధ్యక్షుడిగా నెయ్యిల మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా మణిగాం తాతయ్య, రెల్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.సింహాద్రి, కోశాధికారిగా ఆర్.చిరంజీవి, సహ కార్యదర్శులుగా ఎన్.మాధవరావు, ఇప్పిలి నాగేశ్వరరావు, అప్పారావు, సీలయ్య తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఆదివాసీలను ఆదుకోవాలి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

పలాస: ఆదివాసీ హక్కుల దినోత్సవం ఆగస్టు 9న నిర్వహించాలని ఎ.పి. రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు చెప్పారు. పలాస మండలం లొత్తూరులో శనివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ పోరాట దినంగా జరిపి వారి హక్కులు సాధించుకునేందుకు తగిన ప్రణాళికలు రూపొందించాలని, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం నాయకులు సవర బంగ్లా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

నందిగాం: స్థానిక గురుకులంలో విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. శనివారం గురుకులాన్ని సందర్శించి విద్యార్థిని మృతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నందిగాంలో గురుకులం ఏర్పాటు చేసి 30 ఏళ్లు అయ్యిందని, ఇంతరవకు ఇలాంటి దురదృష్టకర సంఘటన జరగలేదన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వాణికి సూచించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈయన వెంట చింతాడ శ్రీనివాస్ ఉన్నారు.

• చదువుకు సాయం


కవిటి మండలం బల్లిపుట్టుగ గ్రామానికి చెందిన పేద విద్యార్థి బచ్చల వాసుదేవ్ కోచింగ్ కోసం చింతామణి ట్రస్టు (హైదరాబాద్) నిర్వాహకులు శనివారం రూ.40,000 ఆర్థిక సాయాన్ని అందజేశారు. పేద విద్యార్థికి అండగా నిలిచిన ప్రిన్సిపాల్ పి.రాజేశ్వరరావు దాతల్ని అభినందించారు.

\- కవిటి

• క్రీడాకారిణికి ప్రోత్సాహం


టెక్కలి మండలం పెద్దసాన గ్రామానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి గొర్గి రోహిణి ఐడీసీఏ ఉమెన్స్ 5వ నేషనల్ చాంపియన్‌షిప్ ఫర్ డెఫ్ పోటీలకు ఎంపికైంది. హర్యానాలో జరిగే ఈ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో గ్రామస్తులంతా కలిసి శనివారం రూ.18 వేలు ఆర్థిక సాయం అందించారు.

\- టెక్కలి రూరల్

• కొన తుంచితేనే దిగుబడి సాధ్యం


వరినారు ముదిరితే కొనలు తుంచి నాట్లు వేసుకోవాల ఇచ్ఛాపురంమండల వ్యవసాయాధికారి టి.భార్గవి అన్నారు. శనివారం మశాఖపురం పంట పొలాల్లో పొలంబడి నిర్వహించి కూలీలకు, రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జి ఎం.చిట్టిబాబు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

\- ఇచ్ఛాపురం రూరల్

జలం..గరళం!

- ఇంటింటికి కుళాయి నుంచి బురద నీరు
- తాగేందుకు పనికి రావడం లేదని ప్రజల ఆవేదన


కుళాయి నుంచి వస్తున్న బురద నీరు

ఇచ్ఛాపురం రూరల్:

ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. మొదట్లో మంచినీరు రావడంతో ప్రజలు ఎంతగానో సంతోషించారు. తర్వాత సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో పథకం పడకేసింది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలైన ముచ్చింద్ర, కేదారిపురం, బెన్నుగానిపేట గ్రామాలకు కొన్ని రోజులుగా కుళాయిల నుంచి బురద నీరు వస్తుండటంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటిని వడపోసి తాగుతున్నా రోగాలు సంక్రమిస్తున్నాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ బురద నీరు కూడా పట్టుమని పది నిమిషాలు రావడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం వస్తున్న నీటితో పశువులకు, దుస్తులు ఉతికేందుకు మాత్రమే వినియోగిస్తున్నామని అంటున్నారు. పురుషోత్తపురం రైల్వే క్రాస్ నుంచి ముచ్చింద్ర వరకు తారురోడ్డు వేసిన సమయంలో పైపులైన్ దెబ్బతిందని, దాన్ని బాగుచేయకపోవడం వల్లే బురద నీరు వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ బాగుచేసి పరిశుభ్రమైన తాగునీరు అందజేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బురద నీరే..



మొదట్లో మంచినీరు వచ్చినా తర్వాత బురద నీరే వస్తోంది. అది కూడా పది నిమిషాలు రావడం లేదు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. పైప్‌లైన్ బాగుచేసి మంచినీరు అందిస్తే బాగుంటుంది.

\- సాడి తులసీ, ముచ్చింద్ర, ఇచ్ఛాపురం మండలం

తల్లిపాలు శ్రేయస్కరం


టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

టెక్కలి/వజ్రపుకొత్తూరు/వజ్రపుకొత్తూరు రూరల్/ఇచ్ఛాపురం రూరల్: డబ్బా పాలు కంటే తల్లి పాలు శ్రేష్ఠమంటూ ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. శనివారం టెక్కలి ఎన్‌టీఆర్ కాలనీలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయం ఆరోగ్య కార్యకర్తలు కలిసి తల్లిపాల ఆవశ్యకతను బాలింతలు, గర్భిణులకు వివరించారు. వజ్రపుకొత్తూరు మండలం కంబాలరాయుడుపేట, కొండపల్లి, ఇచ్ఛాపురం మండలం మండపల్లి తోటూరు, లొద్దపుట్టి, అయ్యవారిపేట, కేశపురం తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

9న క్విట్ కార్పొరేట్ నిరసన ప్రదర్శన



మాట్లాడుతున్న వేణుగోపాల్

కాశీబుగ్గ : ఈ నెల 9న నిర్వహించనున్న క్విట్ కార్పొరేట్ నిరసన ప్రదర్శన విజయవంతం చేయాలని రైతు, కార్మిక సంఘాల నాయకులు సీహెచ్ వేణుగోపాల్, వంకల మాధవరావు, నెయ్యిల గణపతి, మామిడి భీమారావు పిలుపునిచ్చారు. శనివారం కాశీబుగ్గలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కాపాడుకోడానికి కార్పొరేట్లను తరమాలని పిలుపునిచ్చారు.

జీవో 117 రద్దు చేయాలి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

కవిటి : జీవో 117ను కూటమి ప్రభుత్వం రద్దు చేసి విద్యావ్యవస్థను కాపాడాలని ఏపీటీఎఫ్(1938) నేతలు ఆరోపించారు. శనివారం మాణిక్యపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుమలత తదితరులు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ 80 వసంతాల పోస్టర్, రాష్ట్రస్థాయి సమావేశాల కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు బల్లెడ రవి, బుక్కూరు వెంకటేశ్వర్లు, బల్ల ధర్మారావు, గుడియా వంశీ, రాజబాబు, కొత్తపల్లి రంగారావు, భుజంగరావు, గోపి పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులను ఆదరించాలి


మానసిక దివ్యాంగులతో సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు, నిర్వాహకులు

కంచిలి: మానసిక అనారోగ్యం స్థిరంగా ఉండేది కాదని, సరైన చికిత్స లభిస్తే పూర్తిగా నయమవుతుందని జిల్లా సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు అన్నారు. కంచిలి మండలం తలతంపరలో ఏర్పాటు చేసిన సీతయ్య ఫౌండేషన్ ఆవరణలో శనివారం మానసిక దివ్యాంగులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మద్దు సర్వేశ్వరరావు, న్యాయవాదులు విజయ్‌కుమార్, సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకులు జి.రమేష్, జి.మోహనరావు పాల్గొన్నారు.

గిరిజన భవన నిర్మాణం అడ్డుకోవడం తగదు

కంచిలి: మండలంలోని నువాగడ కాలనీలో చేపడుతున్న గిరిజన భవన నిర్మాణాన్ని అడ్డుకోవడం దారుణమని ఆదివాసీ గిరిజన సంఘ జిల్లా నాయకులు సవర దర్మారావు, రుషిభయ్యా అన్నారు. శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ అన్యాక్రాంతమైన భూములలో తుప్పలు, డొంకలు తొలగించి ప్రభుత్వం మంజూరు చేసిన మల్టీ పర్పస్ భవన నిర్మాణానికి భూమిచదును చేశామని, ఇప్పుడా భూమి తనదంటూ అగ్రవర్ణానికి చెందిన వ్యక్తి అభ్యంతరం చేపట్టడం దారుణమన్నారు. సమావేశంలో సర్పంచ్ సభిత గొమాంగో, గిరిజన సంఘ నాయకులు జోగేంద్ర, జయరాం, ఖగపతి, రామచంద్ర, లక్ష్మణ పాల్గొన్నారు.

చిన్నారులను పనిలో పెట్టడం నేరం


షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఇచ్ఛాపురం : బడి ఈడు పిల్లలను పనిలో పెట్టడం నేరమని జిల్లా బాలల రక్షణ విభాగం అధికారులు స్థానిక దుకాణాదారులకు అవగాహన కల్పించారు. ఇచ్ఛాపురం పట్టణంలోని బ్రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం షాపులు, గ్యారేజీలు, బేకరీలు తనిఖీ చేశారు. లేబర్ ఆఫీసర్ ఎం.విజయ్ కుమార్, సోషల్ వర్కర్ ఐ.జనార్దన, చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ ఎం.సునీత, బ్రెడ్స్‌ఎన్జీవో సభ్యులు చిరంజీవి, ఎం.స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న న్యాయమూర్తి మాధురి

కాశీబుగ్గ:

గిరిజనులు తమ హక్కులను తెలుసుకోవాలని పలాస జూనియర్ సివిల్ కోర్టు జడ్జి యు.మాధురి అన్నారు. పలాస మండలం లొత్తూరు ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను శనివారం సందర్శించారు. విద్యార్థులు సమావేశమై ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం అన్నెపు శ్రీధర్‌పాత్రో, బార్ అసోసియేషన్ కార్యదర్శి జీఎంఎస్ అనిల్‌రాజు, పిండి వెంకటరావు, ఏపీ ఎన్జీఓ అధ్యక్షుడు బోనెల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

కాశీబుగ్గ: పలాస మండలం లొత్తూరు, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పెంటిభద్ర గ్రామాల్లో మండల లీగల్ సెల్ చైర్‌పర్సన్, జూనియర్ సివిల్ జడ్జి యూ.మాధురి, పలాస బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్లు సునీత, మౌనిక, సాయికిరణ్‌లు గిరిజనులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి పిండి వెంకటరావు, జాయింట్ సెక్రటరీ జీఎంఎస్ అనిల్‌రాజు, చంద్రశేఖర్, కోత రజని కుమార్, తాండ్ర మురళి, ప్రభాకర్, రవికుమార్ పట్నాయక్, దేవరాజు, శ్యామ్, చిట్టిబాబు, తేజేశ్వర రావు, ఎల్.వెంకటరావు, కోర్ట్ సూపరింటెండెంట్ కృష్ణ, ఫార్మసిస్ట్ బోనెల గోపాల్, సర్పంచ్ సవర పద్మ, పాస్టర్ రామకృష్ణ, కౌన్సిలర్ సోమేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ రాంబాబు, హెడ్ మాస్టర్ వైకుంఠరావు, శ్రీధర్, ఈశ్వరి, ఎఎన్ఎంలు ఇందిరా, ఆశ వర్కర్స్ సీసీ నారాయణ పాల్గొన్నారు.

జీడిపంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పలాస: ఉద్దానం ప్రాంత ప్రజల జీవనాధారమైన జీడి పంటకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడి వస్తుందని పలాస ఉద్యానవన శాఖాధికారి శంకర్‌దాస్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షాకాలంలో రెండు విడతలుగా ఎరువులు వేయాలన్నారు. ముందుగా పంట కాపు అయిన వెంటనే జీడి కొమ్మలు కత్తిరించాలని, ఈ ప్రక్రియ జూన్ చివర వారంలో జరగాలన్నారు. ఆ తర్వాత జూలైలో మొదటి విడతగా యూరియా, సూపర్ ఫాస్ఫేట్, వేప పిండి, పశువుల గత్తం తగిన మోతాదులో వేయాలన్నారు. రెండో విడతగా సెప్టెంబరులో సమాన పాళ్లలో ఎరువులు వేయాలని సూచించారు. మొక్కల వయస్సు బట్టి ఎరువును చెట్టు నుంచి 3, 5 అడుగుల దూరంలో గుంత తవ్వి వేయాలన్నారు. జీడి చెట్లు మొదల్లో రాలిన జీడి ఆకులను మట్టి కప్పి ఉంచితే అవి కూడా ఎరువుగా మారుతాయన్నారు.

పశుగణనకు సహకరించాలి

టెక్కలి: సెప్టెంబర్‌లో నిర్వహించనున్న పశుగణనకు పాడి రైతులు, పశువుల యజమానులు సహకరించాలని పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు వి.జయరాజ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 6 నుంచి సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 78, 182 గృహాలను సందర్శించి పశు గణన చేపడుతున్నట్లు వెల్లడించారు.

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు


అవగాహన కల్పిస్తున్న పట్టణ ఎస్ఐ సత్యనారాయణ

ఇచ్ఛాపురం: మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం నాశనమవుతుందని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై శనివారం శ్రీసురంగిరాజా క్రీడామైదానం ఆవరణలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, గుట్కా వంటి నిషేధిత పదార్థాలు కలిగి ఉండటం చట్టరీత్యా నేరమని, వాటికి వీలైనంత దూరంగా ఉండాలని సూచించారు..

బారువ రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలని వినతి

సోంపేట: బారువ రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేయాలని కొర్లాం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు శనివారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కొర్లాం గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, కొర్లాంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ ప్రారంభించాలని విన్నవించారు. కార్యక్రమంలో రాంబుడ్డి గణపతి, రత్నాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులే లక్ష్యం

టెక్కలి: ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి లక్ష్యంగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ శాఖ జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ కె.త్రినాథస్వామి వెల్లడించారు. పొలంబడి కార్యక్రమాలకు సంబంధించి శనివారం టెక్కలి వ్యవసాయ శాఖ ఏడీ కార్యాలయంలో వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు ఉత్పత్తిదారులు, అభ్యుదయ రైతులకు శిక్షణ నిర్వహించారు. సేంద్రియ విధానంతో వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏడీ కె.కృష్ణారావు, వ్యవసాయాధికారులు జి.రంగారావు, ఎస్.గోవిందరావు, ఆర్.అప్పారావు, పి.శ్రీకాంత్‌వర్మ, బి.రవికుమార్, సిబ్బంది పి.సత్యప్రియ, పి.సురేష్ పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ పరిశీలన


పంపిణీని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ భరత్‌నాయక్

కాశీబుగ్గ : మందస మేజర్ పంచాయతీలో జరుగుతున్న బియ్యం పంపిణీ ప్రక్రియను పలాస ఆర్‌డీఓ భరత్‌నాయక్ శనివారం పరిశీలించారు. పంపిణీదారులు, లబ్ధిదారులతో మాట్లాడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు డిప్యూటీ తహశీల్దారు రవికుమార్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


హెచ్‌ఎంకు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

కాశీబుగ్గ : మందస మండలం సొండిపూడి ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02 బ్యాచ్ పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఉదారత కనబరిచారు. తాము చదువుకుతున్న పాఠశాల విద్యా అభివృద్ధికి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఇచ్చిన మాట మేరకు ప్రధానోపాధ్యాయుడు బి.సుందర్‌కు ఈ మొత్తాన్ని శనివారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సంకోయి శ్రీను, పైల మోహనరావు, గవ్వ భీమారావు, కొత్తపల్లి, విద్యాసాగర్, ఎలుముల రాజు, నూకల మురళి, పిట్ట మహేష్ పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలపై పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ నాగేశ్వరరావు

టెక్కలి: చిన్న తరహా పరిశ్రమల స్థాపన, అభివృద్ధి, సమస్యలు, పరిష్కార మార్గాలు అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం పుస్తకావిష్కరణ చేశారు. కళాశాలకు చెందిన ఎంబీఏ విభాగం అధ్యాపకుడు కె.వేణుగోపాల్ రచించిన 'రివర్స్ లాజిస్టిక్స్ ఫర్ స్మాల్ బిజినెస్ ' అనే పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఎంబీఏ హెచ్‌ఓడీ బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వియ్ ఫర్ యూ అధ్యక్షుడిగా శ్రీకాంత్

సోంపేట: వియ్ ఫర్ యూ సేవా సంస్థ నూతన అధ్యక్షుడిగా పూనా శ్రీకాంత్‌ను కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫౌండేషన్ 16వ వార్షిక సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ రమేష్‌కుమార్, షణ్ముఖ పాణిగ్రాహి, బల్ల బాబురావు, జోగారావు తదితరులు పాల్గొన్నారు.